
సాక్షి
బాపట్ల
గురువారం । 28 । మార్చి । 2024



పుష్పయాగోత్సవం

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి వారికి బుధవారం వైభవంగా శ్రీ పుష్పయాగోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముగింపుగా స్వామి వారికి ఈ ప్రక్రియ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
బాపట్ల	6.25	4.49
నరసరావుపేట	6.27	4.51
గుంటూరు	6.25	4.49

న్యూస్‌రీల్

జిల్లా ఎస్పీకి డీజీపీ డెస్క్ గోల్డ్ మెడల్


ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: నూతనంగా ఏర్పడిన జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు కేసుల ఛేదనలో అత్యంత ప్రతిభ కనపరిచిన ఎస్పీ వకుల్‌జిందాల్ సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర డీజీపీ డెస్క్ గోల్డ్‌మెడల్ అవార్డుకు ఎంపిక చేసింది. ఆయనతో పాటు జిల్లాలోని పి. శ్రీకాంత్ (డీఎస్పీ), జి. రాజ్‌కుమార్ (చుండూరు ఏఎస్ఐ), మహ్మద్ ఖాశిం (వేటపాలెం హెడ్ కానిస్టేబుల్), డి. మస్తాన్‌రావు (రేపల్లె ఏఎస్ఐ), పిట్టు రామారావు (చీరాల–1 టౌన్ హెడ్ కానిస్టేబుల్), డి. వీరబ్రహ్మం (చీరాల 1టౌన్ పీసీ), ఎం. వెంకటేశ్వర్లు (బాపట్ల హెడ్‌కానిస్టేబుల్), షేక్ కరీముల్లా (బాపట్ల పీసీ)లను సిల్వర్ మెడల్స్‌కు ఎంపిక చేశారు. త్వరలో వీరందరికీ డీజీపీ చేతుల మీదుగా అవార్డులను అందజేయనున్నారు.

సాగర్ నీటిని పొదుపుగా వాడుకోవాలి

నరసరావుపేట: నాగార్జున సాగర్ జలాశయంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ అధికారుల్ని ఆదేశించారు. ఆయన బుధవారం జిల్లాలో తాగునీటిపై సంబంధిత అధికారులతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు నీటి సరఫరాపై గ్రామాల్లో పర్యవేక్షించాలని, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి సమన్వయ సమావేశం నిర్వహించి పకడ్బందీగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మున్సిపాలిటీల వారీగా నీటి సమస్యలు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల్ని రూపొందించాలని అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా అధికారి ఆర్.ఎస్.ఆర్.సురేష్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి. భాస్కర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ టి.వరలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాకాని మల్లేశ్వరుడికి రూ. 52లక్షల ఆదాయం



పెదకాకాని: శివాలయంలో హుండీల కానుకలు లెక్కింపు ద్వారా మల్లేశ్వరుని ఆదాయం గణనీయంగా పెరిగినట్లు డెప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. పెదకాకాని శివాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు అన్ని హుండీలను తెరచి కానుకలు లెక్కింపు చేపట్టారు. పాత గుంటూరు శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.ఎల్.టి. సౌమ్య పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. లెక్కింపు సాయంత్రం ఐదు గంటల వరకూ కొనసాగింది. 96 రోజులకు గాను స్వామికి రూ. 52,70,371, అన్నదానం హుండీ ద్వారా రూ.79,370, బంగారం 11.500 గ్రాములు, వెండి 705.500 గ్రాములు లభించినట్లు డెప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.లెక్కింపులో ఆలయ, బ్యాంక్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

14న ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ సమావేశం

కొరిటిపాడు(గుంటూరు):ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 14న గుంటూరులోని ఫర్టిలైజర్స్ అండ్ ఇన్‌సెక్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరగనుందని రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–27 కాల వ్యవధికి సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 9849764646 నంబరును సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

యార్డుకు 1,14,185 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,14,185 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,10,908 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది.

తీరానికి మణిహారం

- నిజాంపట్నం హార్బర్ అభివృద్ధిపై జగనన్న దృష్టి
- నెరవేరుతున్న మత్స్యకారుల కల
- శరవేగంగా రెండో దశ అభివృద్ధి పనులు
- ఇప్పటికే బౌల్డర్స్ నిర్మాణం పూర్తి


నిజాంపట్నం హార్బర్ ఏరియల్ వ్యూ

రేపల్లె రూరల్: సముద్ర తీర ప్రాంతాల్ని అభివృద్ధి చేసి మత్స్యకారుల జీవనోపాధి అవకాశాల్ని మెరుగు పరచాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరుతోంది. గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసి మృత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంస్కరణలు విజయవంతం అవుతున్నాయి. దీంతో నిజాంపట్నం ప్రాంత మత్స్యకారుల కల సాకారమవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధిక తీరప్రాంతం కలిగిన నిజాంపట్నం హార్బర్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. రూ.451 కోట్లతో రెండవ దశ నిర్మాణ పనులకు గత ఏడాది శ్రీకారం చుట్టింది. శరవేగంగా జరుగుతున్న పనులు ఇప్పటికే 80 శాతం పైగా పూర్తయ్యాయి.

ప్రస్తుత హార్బర్ పరిస్థితి

నిజాంపట్నం హార్బర్‌లో 1980లో 60 బోట్ల నిలుపుదల చేసే విధంగా 250 మీటర్లతో జెట్టీని రూపొందించారు. నాటి నుంచి దినదినాభివృద్ధి చెందుతూ బోట్ల సంఖ్య గణనీయంగా పెరగడంతో జెట్టీ సమస్య తీవ్రంగా మారింది. దీంతో పాటు సముద్రంలోకి బోట్ల రాకపోకలకు ఏర్పాటు చేసిన మొగ సామర్థ్యం కుచించుకుపోయింది. ప్రస్తుత నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బోట్లు జెట్టీ వద్దకు రాకపోకలకు తీవ్ర విఘాతంగా ఏర్పడుతోంది. ఒక్కోసారి మొగ వద్ద బోట్లు కింది భాగం తగిలి దెబ్బతింటున్న పరిస్థితులు ఉన్నాయి. దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. విపత్తుల సమయంలో జెట్టీలో నిలుపుకునే జాగాలేక కాలువ ఒడ్డున నిలుపుకోవడం వల్ల తుపానుల సమయంలో బోట్లు దెబ్బతినడం, ఈదురు గాలులకు సముద్రంలోకి కొట్టుపోవడం సంఘటనలతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోవడం పరిపాటిగా మారాయి.


నిజాంపట్నం హార్బర్‌లో లైట్ హౌస్

రెండ దశలో జరుగుతున్న అభివృద్ధి పనులు

హార్బర్‌లో రూ.451కోట్లతో జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకుంటున్నాయి. ప్రధానంగా మోటరైజ్డ్ బోట్లు–1000, 15 మీటర్ల మెకనైజ్డ్ బోట్లు–500, 24 మీటర్ల టూనా లాంగ్ లైనర్స్–100 ఒకేసారి 1600 వివిధ రకాల బోట్లు నిలుపుకునేందుకు వీలుగా 500 మీటర్లతో జెట్టీ నిర్మాణం, ప్రస్తుత మొగ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఇరువైపులా 1570 మీటర్ల బౌల్డర్స్ ఏర్పాటుతో ఆధునికీరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. వీటితో పాటు ఆఫీసు బిల్డింగ్, రెస్ట్ రూమ్, ఐస్‌ప్లాంట్, ఓవర్ హెడ్ ట్యాంక్, సాలీడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పార్కింగ్ ప్లేస్, ఆక్షన్ హాల్, బోటు బిల్డింగ్ యార్డ్, నెట్ రిపేర్ షెడ్, బీఎల్‌సీ పార్కింగ్, సోలార్ ప్యానల్స్‌తో పాటు ఇతర అధునాతన సౌకర్యాలతో నిర్మాణాలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం హార్బర్ పనుల్లో అత్యంత కీలకమైన మొగ సామర్థ్యం పెంపుదల, ఉత్తరం వైపు, దక్షిణం వైపు బౌల్డర్స్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం బోట్లు రాకపోకలకు ఆటంకం కలుగకుండా బ్రేక్ వాటర్ సిస్టంను నిర్వహిస్తున్నారు.

పనులు పూర్తయితే వేలాది మందికి ఉపాధి

హార్బర్ అభివృద్ధి పనులు పూర్తయితే 9000 వేలాది మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి. దీంతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే సమస్యకు పరిష్కారమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బోట్లు నిజాంపట్నం హార్బర్‌కు రాకపోకలు సాగించే అవకాశాలు ఉన్నాయి. దీని వల్ల మత్స్యసంపద ఎగుమతులు, దిగుమతులు పెరిగే అవకాశం కలుగుతుంది. దీంతో హార్బర్‌లో ప్రత్యక్షంగా, పరోక్షకంగా వేలాది మందికి ఉపాధి కలిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

సీఎం జగనన్న చొరవ మరువలేం



హార్బర్‌లో జెట్టీ సామర్థ్యం చాలకపోవడంతో బోట్లు నిలుపుకునే సందర్భాలలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఒడ్డున కట్టేసిన బోట్లు ప్రకృతి వైపరీత్యాల సమయంలో దెబ్బతినడంతో పాటు సముద్రంలోకి కొట్టుకుపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హార్బర్ అభివృద్ధి ప్రత్యేక చొరవ చూపడం మరువలేము.

– నాయుడు వెంకటేశ్వరరావు, బోటు ఓనరు, నిజాంపట్నం

పనులు పూర్తయితే వేలాది మందికి ఉపాధి



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో హార్బర్ అభివృద్ధి పనులపై దృష్టి సారించి రూ.451 కోట్లు కేటాయించి, పనులు ప్రారంభించారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆధ్వర్యంలో వేగవంతంగా జరుగుతున్నాయి. హార్బర్ అభివృద్ధి పనులు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించే కేంద్రంగా నిజాంపట్నం మారుతుంది.

–మోపిదేవి శ్రీనివాసరావు, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

త్వరలో హార్బర్ ప్రారంభం

హార్బర్ అభివృద్ధి పనుల్లో ప్రధానమైన మొగ సామర్థ్యం పెంపు పనులు పూర్తయ్యాయి. మొగ వద్ద డ్రెజ్జింగ్, ఉత్తర, దక్షిణ వైపు బౌల్డర్స్ నిర్మాణం, బ్రేకింగ్ వాటర్ సిస్టం పనులు పూర్తికావటంతో బోట్ల రాకపోకలు జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా భవన నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. త్వరలో పనులు పూర్తి చేసి ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నాం.

– పి.రఘుకిశోర్‌రెడ్డి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, నిజాంపట్నం

మద్యం తరలిస్తున్న టీడీపీ కార్యకర్త అరెస్ట్

వేమూరు: ఎన్నికల ప్రచారానికి మద్యాన్ని తరలిస్తున్న టీడీపీ కార్యకర్తను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జె.రాజశేఖర్ బుధవారం తెలిపారు. జంపని గ్రామానికి చెందిన నాదెండ్ల సురేష్ అనుచరుడు పీకేఎం కుమార్ గుప్తా కొల్లూరు మండల కేంద్రంలోని మద్యం షాపులో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో 72 బాటిళ్లు గోతంలో వేసుకొని తరలిస్తుండగా వేమూరు నుంచి వరహాపురం వెళ్లే రోడ్డులో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తూర్పు కొప్పెరపాడులో కోడ్ ఉల్లంఘన

జె.పంగులూరు: మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడులో టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్ పట్టించుకోవడం లేదు. గ్రామంలోని ఓ ఇంటిపై పార్టీ జెండాలు, షాపుల వద్ద గొట్టిపాటి రవి కుమార్ సంబంధించిన పోస్టర్లు అంటించారు. కానీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోతురాజుగుట్టలో వృద్ధురాలి హత్య

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల శివారు బాలచంద్రానగర్ (పోతురాజుగుట్ట)లో 75 ఏళ్ల వృద్ధురాలు బుధవారం రాత్రి హత్యకు గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లో చొరబడి తలను గోడకేసి మోది హత్య చేశారని ఘటనా స్థలాన్ని బట్టి భావిస్తున్నారు. సమాచారం అందుకున్న కారెంపూడి సీఐ చినమల్లయ్య, ఎస్ఐ రామాంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. హత్యకు గురైన ఆలా లక్ష్మమ్మ(75) గత పదేళ్లుగా పోతురాజుగుట్టలో ఒంటరిగా జీవిస్తూ వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అందరితో బాగా కలివిడిగా ఉంటుందని ఆమెను ఎవరు ఎందుకు హత్య చేశారో తెలియడం లేదని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

'మేమంతా సిద్ధం'తో జోష్

- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం
- ఇడుపులపాయ నుంచి మొదలైన వైఎస్.జగన్ ఎన్నికల ప్రచారం
- జిల్లాలో ఇప్పటికే ఇన్‌చార్జ్‌ల ఎంపిక ప్రక్రియ పూర్తి
- నియోజకవర్గాల్లో జోరందుకున్న ప్రచారం
- మళ్లీ అధికారం తమదేనంటున్న అధికార పార్టీ నేతల ధీమా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఐదేళ్ల జనరంజక పాలనతో జనం గుండెల్లో గూడుకట్టుకున్న అధికార పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' ప్రచారం మరింత సానుకూలంగా మారనుందా? జగన్ నోటివెంట సంక్షేమ పథకాల లబ్ధిని విన్న జనంలో ఆ పార్టీ పట్ల సానుకూలత రెట్టింపు కానుందా? అధినేత ఎన్నికల ప్రచారం పార్టీ కేడర్‌లో మరింత జోష్ నింపనుందా? మొత్తంగా వైఎస్.జగన్ ఎన్నికల ప్రచారం అధికార పార్టీకి తిరుగులేని ఆధిక్యతను కట్టబెట్టనుందా? క్షేత్రస్థాయిలో ఇందుకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి.

కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం కాగా... ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం కనిపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి తిరిగి పట్టం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నది క్షేత్రస్థాయిలో అంచనా. పరిశీలకులు, రాజకీయ విశ్లేషకుల నుంచి ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూడు పార్టీల కూటమిపై ప్రజల్లో సానుకూలత లేదని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలు వ్యతిరేకిస్తున్నట్లు అంచనా.

పేదల బతుకులకు జగన్ భరోసా

వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పథకాలు పెద్దఎత్తున అమలు చేశారు. మహిళల సాధికారత, ఆర్థిక ఎదుగుదలకు ప్రాధాన్యత ఇచ్చారు. దాదాపుగా అన్ని ప్రభుత్వ పథకాలకు వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఇన్నాళ్లుగా ఒకపూట తిండికి నోచుకోని పేదలు కడుపునిండా తినడంతోపాటు పిల్లల చదువులు, కుటుంబ పోషణ ఇతర ఇబ్బందులు తొలగించి వారికి సమాజంలో బతుకు భరోసా కల్పించారు. ఇదే నిజమైన అభివృద్ధి అని నిర్వచించారు. దీంతోపాటు అన్నివర్గాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది.

కూటమి కుట్రలు బట్టబయలు

ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నుంచి మేమంతా సిద్ధం పేరుతో ఇడుపులపాయ నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇన్నాళ్లూ ఒక ఎత్తు ..ఇప్పుడు ఒక ఎత్తు అన్నట్లు ఆయన ప్రచారం మొదలైంది. ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని వర్గాలకు చేసిన మేలును ఆయన నేరుగా ప్రజలకు వివరించనున్నారు. అదే సమయంలో కూటమి పార్టీల పచ్చ కుట్రలను జనంలోపెట్టి చీల్చి చెండాడనున్నారు. ఇది పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం నెలకొల్పనుంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం మొదలు కాగానే అధికార పార్టీ మరింత దూసుకు వెళ్లనుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

కలిసి రానున్న సామాజిక న్యాయం

ఇప్పటికే బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థుల ఎంపికను పూర్తిచేసింది. ఇందులో వేమూరు, సంతనూతలపాడు రిజర్వుడు స్థానాలనుంచి వరికూటి అశోక్‌బాబు, మేరుగ నాగార్జునలను బరిలో నిలిపిన పార్టీ అద్దంకి నుంచి రెడ్డి సామాజికవర్గానికి చెందిన పానెం హనిమిరెడ్డి, పర్చూరు బరిలో కాపు సామాజికవర్గానికి చెందిన ఎడం బాలాజీ, చీరాల నుంచి కమ్మ సామాజిక వర్గానికి చెందిన కరణం వెంకటేష్, బాపట్ల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన కోన రఘుపతి, రేపల్లె నుంచి గౌడ సామాజిక వర్గానికి చెందిన ఈవూరి గణేశ్‌ను పోటీలో నిలిపింది. బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నందిగం సురేష్ ను ఎంపిక చేశారు. అభ్యర్థుల ఎంపికను బట్టి అధికారపార్టీ సామాజిక సమీకరణలకూ పెద్దపీట వేసిందన్న ప్రచారం సాగుతోంది.

జోరందుకున్న ప్రచారం

ఇప్పటికే అధికారపార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఆయా నియోజకవర్గాల్లో గడప గడపకు తిరుగుతూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల జరుగుతున్న లబ్ధిని నేరుగా ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రజల మద్దతుతో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

99 శాతం హామీలు అమలు

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసింది. 87 శాతం కుటుంబాలకు ప్రత్యక్ష నగదు(డీబీటీ) బదిలీ ద్వారా ఆర్థిక లబ్ధి చేకూర్చారు. నాన్‌డీబీటీ ద్వారా మరింత లబ్ధిని చేకూర్చారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రతిపథకాన్ని ప్రజల ఇంటి వద్దకే చేర్చారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్ని మరింత ఆధునికీకరించి ప్రజలకు చేరువచేసి సేలందించారు. దీంతో జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత పెరిగింది. ఇది రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి మరింత కలిసొచ్చే అంశం. ఈ పరిణామాలతో ప్రజలే తిరిగి గెలిపించుకునేందుకు సన్నద్ధమయ్యారన్నది పరిశీలకుల అంచనా. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా తిరిగి అధికారంలోకి రాబోతున్నామని అంచనా కు వచ్చిన అధికారపార్టీ మరింత జోష్‌తో ఉంది.


ప్రచారానికి ముందస్తు అనుమతి తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇంటింటా ప్రచారానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున కమిషన్ మార్గదర్శకాలు తప్పనిసరిగా అనుసరించాల్సి ఉందని తెలిపారు. అభ్యర్థులు తమ ప్రచారానికి సంబంధించిన షెడ్యూల్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ప్రచారాలు చేయాలంటే జిల్లా ఎన్నికల అధికారి వద్ద దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రచారానికి సంబంధించిన వాహనాలు, హెలికాప్టర్ అనుమతులు, ఎయిర్ బెలూన్స్‌కు జిల్లా ఎన్నికల అధికారి అనుమతిస్తారని, నేరుగా లేదా ఆన్‌లైన్‌లో సువిధ యాప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ప్రచారాలు, వాటి అనుమతుల కోసం సంబంధిత ఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. స్టార్ లీడర్లుగా గుర్తింపు పొందిన ప్రముఖ నాయకుల ప్రచారానికి రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారి వద్ద అనుమతి పొందాలన్నారు. మే 11 తేదీ వరకు మాత్రమే ప్రచారాలకు అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలు సక్రమంగా పాటించడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో సవరణలకు గడువు ముగిసిందని తెలిపారు. ఫామ్–7 ఫామ్–8లో (సవరణ) తొలగింపులపై దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముగిసిందన్నారు. ఇకనుంచి కేవలం ఫామ్–6, ఫామ్–8లో షిఫ్టింగ్ ఆఫ్ రెసిడెన్సీ కింద ఏప్రిల్ 15వ తేదీలోగా నమోదైన దరఖాస్తులను మాత్రమే విచారిస్తామని వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, సీపీఓ శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఐ.మాల్యాద్రి, భాజపా నాయకులు కె.వి.రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.రవి, టీడీపీ నాయకులు షేక్ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

ఇసుక క్వారీల్లో తనిఖీలు


జువ్వలపాలెం వద్ద నదిలో పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ, ఆర్‌సీ అధికారులు

కొల్లూరు: ఇసుక క్వారీల్లో చేపట్టిన తవ్వకాలపై పలు ప్రభుత్వ శాఖల అధికారులు కలసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని పెదలంక అరవింద వారధి సమీపంలో ఇటీవల జరిపిన ఇసుక తవ్వకాలతో పాటు, గాజుల్లంక, జువ్వలపాలెం గ్రామాల పరిధిలోని కృష్ణా నదిలో అధికారులు పరిశీలించారు. పెదలంక– పెసర్లంక గ్రామాల పరిధిలో కృష్ణా నదిలో చేపట్టిన తవ్వకాలపై అధికారులు అపరాధ రుసుం విధించడంతో, క్షేత్రస్థాయిలో చేపట్టిన తవ్వకాలను పరిశీలించేందుకు వచ్చిన పలు వివిధ శాఖలకు చెందిన అధికారులు క్వారీలో చేపట్టిన తవ్వకాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే వెను తిరగడంపై స్థానికంగా ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీల విషయంపై అధికారులను వివరణ కోరేందుకు సంప్రదించగా, విషయం వెల్లడించేందుకు నిరాకరించారు. కార్యక్రమంలో మైనింగ్ జియాలజిస్టు ఫణిరాజ్‌కుమార్, గ్రామీణ నీటిసరఫరా శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ జాన్‌ప్రదీప్, ఆర్‌సీ ఏఈ సురేష్‌కుమార్, భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక నిపుణురాలు వసంతకుమారి, తహసీల్దార్ పుల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



రేపల్లె రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని డెకాయ్ ఆపరేషన్ బృంద సభ్యురాలు మరియమ్మ అన్నారు. డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వైద్యశాలలో, ప్రైవేటు స్కానింగ్ సెంటరులలో డాక్టర్లు రమేష్, జాన్‌ప్రసాద్ పర్యవేక్షణలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. గర్భస్థ సమయంలో శిశువు లింగ నిర్ధారణ చేసే భ్రూణహత్యలు జరిగేందుకు అవకాశం ఉందన్నారు. వీటి కట్టడికి గర్భిణులకు స్కానింగ్ చేసే సమయంలో తన కడుపులో పెరుగుతున్నది మగ శిశువా, ఆడ శిశువా అన్న అంశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తెలపరాదన్నారు. ఈ పరీక్షలు నిర్వహించి గర్భిణికి గాని, ఆమె బంధువులకు తెలిపితే సంబంధిత వైద్య సిబ్బంది, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు గల్లా చక్రధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'సంగం' ట్యాంకర్ ఢీ కొని యువకుడి మృతి



చేబ్రోలు: సంగం డెయిరీ పాల ట్యాంకర్ ఢీ కొని మెకానిక్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వేజండ్ల అడ్డరోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తెనాలి మండలం చినరావూరు గ్రామానికి చెందిన అవ్వారు మోహన కృష్ణ (25) స్కూటీ ద్విచక్ర వాహనంపై నారాకోడూరు వైపు నుంచి తెనాలికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో తమిళనాడు నుంచి సంగం డెయిరీకి వెళ్తున్న సంగం డెయిరీ పాల వాహనం ప్రమాదవశాత్తూ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో యువకుడు మోహనకృష్ణ అక్కడికక్కడే మరణించాడు. మృతుడు మోహన కృష్ణ తెనాలిలో బైక్ మెకానిక్ పనిచేస్తున్నట్లు తెలిసింది. చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదఘటన విషయాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చదువుతో పాటు క్రీడలూ ప్రధానమే

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి
- ఫార్మసీ విద్యార్థుల క్రీడా పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవ వేదికపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుతో పాటు క్రీడలు కూడా ప్రధానమేనని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకుని నిలబడటంలో క్రీడా నైపుణ్యం ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి సూచించారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం స్పర్థ-2కే24 పేరుతో ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్పోర్ట్స్‌మీట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ఫార్మసీ విద్యలో నైపుణ్యాలతో పాటు ఔషధ రంగంలో పరిశోధనలు చేస్తూనే క్రీడాంశాల్లో ప్రావీణ్యం కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా ఉత్సాహంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉండగలరన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని తమ కుటుంబంతో పాటు చదువుతున్న కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు.

కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ హిందూ ఫార్మసీ కళాశాల రజతోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా రెండు రోజుల పాటు కబడ్డీ, కేరమ్స్, వాలీబాల్, చెస్, షాట్‌పుట్, త్రోబాల్ అంశాల్లో పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించి, పావురాలను, బెలూన్లను ఎగురవేశారు. కార్యక్రమంలో కబడ్డీ రిఫరీ వెలగా అమ్మయ్య, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూధనరావు, గౌర చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, పాలకమండలి సభ్యులు మాజేటి ప్రసాద్, చింతలపాటి వెంకట్రామయ్య, చెరువు రామమూర్తి, డాక్టర్ రామాతారక్‌నాథ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజిత్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు ముగిశాయ్

- మాల్ ప్రాక్టీసులు లేని విధంగా సరికొత్త రికార్డు
- గుంటూరు జిల్లాలో ఇదే ప్రథమం



గుంటూరులోని ఓ పరీక్షా కేంద్రం నుంచి పరీక్షలు రాసి ఆనందంగా బయటకు వస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు బుధవారం ముగిశాయి. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అధికార యంత్రాంగం చేసిన విస్తృతమైన ఏర్పాట్లతో ఈనెల 18న పరీక్షలు మొదలైన రోజు నుంచి గుంటూరు జిల్లాలో ఎక్కడా.. ఎటువంటి పొరపాటుకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థులు ఉత్సాహంగా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత గుంటూరు జిల్లాలో తొలిసారిగా జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షలు మాల్ ప్రాక్టీసులకు తావు లేని విధంగా జరగడం ఒక రికార్డుగా చెప్పవచ్చు. పరీక్ష కేంద్రాల ఏర్పాటు మొదలు, వసతుల కల్పన, కాన్ఫిడెన్షియల్ మెటీరియల్‌ను పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు చేర్చడం, పరీక్ష జరిగిన తరువాత ఆన్సర్ పేపర్లను పకడ్బందీగా ఏర్పాట్ల మధ్య తిరిగి పోస్టాఫీసుల్లో డిపాజిట్ చేయడం వంటి అన్ని అంశాల్లోనూ అధికారులు క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యలతో జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా పరీక్షల మానిటరింగ్ విభాగం నిరంతరం పరీక్షల సరళిని పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో ఇటు అధికారులు, అటు విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నిముషం ఆలస్యం నిబంధన ఏదీ లేకపోవడంతో పాటు పరీక్షలు జరిగిన రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క విద్యార్థి సైతం ఆలస్యంగా వచ్చారనే కారణంతో పరీక్షకు అనుమతించని సంఘటన సైతం చోటు చేసుకోలేదు. బుధవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 147 కేంద్రాల పరిధిలో కేటాయించిన 27,934 మంది విద్యార్థులకు గాను 27,284 మంది హాజరయ్యారు. 46 కేంద్రాల్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ ప్రకటనలు అనుమతించవద్దు

నరసరావుపేట: ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాలతో పాటు కార్యాలయాల్లో కూడా ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించ వద్దని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం జాతీయ, ప్రధాన రహదారుల పక్కనున్న హోర్డింగులు అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయించాలని, నూతన హోర్డింగులకు అనుమతులను ఏమాత్రం ఇవ్వొద్దన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్స్‌కు ఎటువంటి అనుమతి లేదని, ఇప్పటికే ఉన్న వాటిని వెంటనే చెరిపించాలని కోరారు. ప్రభుత్వ అనుమతితో ప్రైవేటు భవనాలపై ఇప్పటికే ఉన్న హోర్డింగులు, కటౌట్ల భద్రతను, నిర్మాణ స్థిరత్వాన్ని ఒకసారి పరిశీలించాలని, స్ట్రక్చర్‌లో ఏమాత్రం ధృడత్వం లేకపోయినా ప్రకటనలకు అనుమతించ వద్దన్నారు. ముందస్తు అనుమతితో ప్రైవేటు ప్రాంగణాల్లో సులువుగా తరలించగలిగే ఒక జెండాను, చిన్న బ్యానర్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని సూచించారు. అదే విధంగా సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పటిష్టంగా అమలు పర్చాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు.

సుప్రీం ప్రధాన న్యాయమూర్తిని కలిసిన శశిధర్



తాళపత్ర గ్రంథాల విశిష్టతను సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌కు వివరిస్తున్న డాక్టర్ శశిధర్

చీరాల రూరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డీవై చంద్రచూడ్‌ను బుధవారం తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో చీరాల సనాతన్ జీవన్ ట్రస్టు నిర్వాహకులు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గడ శశిధర్ కలిశారు. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలోని తాళపత్రాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బుధవారం తిలకించారు. ఈ సందర్భంగా తాళపత్ర గ్రంథాల తర్జుమా కర్త, సనాతన్ జీవన్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ శశిధర్ కలసి తాళపత్ర గ్రంథాల విశిష్టతను గురించి న్యాయమూర్తికి వివరించారు. గ్రంథాలను డిజిటలైజేషన్ చేసి కంప్యూటరీకరణ చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు అందించవచ్చునని వివరించినట్లు చెప్పారు. అనంతరం న్యాయమూర్తి విశ్వవిద్యాలయంలో సంరక్షిస్తున్న వేద, వేదాంగంగా, ఆగమ, పురాణ, ఇతిహాస, న్యాయ, దర్శనాలకు సంబంధించిన తాళ పత్ర గ్రంథాల సంరక్షణ, డిజిటలైజేషన్ ప్రక్రియ, వాటి ప్రచురణను న్యాయమూర్తి పరిశీలించారని చెప్పారు. టీటీడీ వారు ఇటువంటి వేద విశ్వవిద్యాలయాలను నడపడం, పురాతన తాళపత్ర గ్రంథాలను భద్రపరచేందుకు వాటిని తర్జుమా చేసి డిజిటలైజేషన్ చేయడం ఎంతో మంచిపరిణామమని న్యాయమూర్తి ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. తాళపత్ర గ్రంథాలు తర్జుమా చేయడం ద్వారా మన దేశానికే కాక ప్రపంచ దేశాల మానవాళి శ్రేయస్సుకు కూడా ఉపయోగం ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నట్లు చెప్పారు.

రెండు వేర్వేరు కేసుల్లో 8 బైక్‌లు స్వాధీనం

- చోరీకి ఉపయోగించిన ఇన్నోవా కారు
- ఏడుగురి నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ



భట్టిప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఇన్నోవా కారు

భట్టిప్రోలు: రెండు వేర్వేరు కేసుల్లో చోరీకి గురైన రూ.5.20 లక్షల చేసే ఎనిమిది బైక్‌లు, చోరీకి ఉపయోగించిన ఇన్నోవా కారును పోలీసులు చాకచక్యంగా పట్టుకుని ఏడుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. బాపట్ల డీఎస్పీ టి.మురళీకృష్ణ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీన ఎస్‌హెచ్ 216 రహదారిలో ఐలవరం మణికంఠ సప్లయిర్స్ వద్ద పెట్టి ఉన్న మోటారు సైకిల్ అపహరణకు గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 4, కర్లపాలెం, టంగుటూరు పీఎస్ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 6 మోటారు సైకిళ్లతో పాటు ఇందుకు ఉపయోగించిన ఇన్నోవా కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం సీతారామపురం తండాకు చెందిన మీరాజోత్ ప్రసన్నకుమార్ నాయక్ రమావత్ దుర్గాప్రసాద్ నాయక్, బాణావత్ తులసిబాబు నాయక్, బాణావత్ హనుమానాయక్‌లను అరెస్టు చేశారు. అలాగే జనవరి 27వ తేదీన ఎస్‌హెచ్ 216 రహదారిలో పసుపులేటి రాజేష్‌కు చెందిన పంట పొలం పక్కనే పెట్టిన మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు రంగంలోకి దిగి చోరీకి పాల్పడిన నిందితులైన కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెంకు చెందిన శవనం శ్రీనివాసరెడ్డి, వారి మురళీకృష్ణారెడ్డి, భట్టిప్రోలు మండలం ఓలేరు పంచాయతీ పరిధిలోని వెంకట్రాజునగర్‌కు చెందిన దాసరి భరత్‌లను అరెస్టు చేశారు. నిందితులను గురువారం రేపల్లె కోర్టులో హాజరు పరిచారు. వీరిలో ఒకరు మైనర్ కాగా గుంటూరులోని జువైనల్ డిస్ట్రిక్ట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన భట్టిప్రోలు ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్స్ ఈపూరి వెంకటేశ్వరరావు, సైకం నాగరాజు, గంటా మాధవరావు, తాడివాక వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్స్ క్రాప పుల్లారావు, బేతల అనీల్ కుమార్, కాటూరి నాగరాజు, హోమ్ గార్డు కె.ప్రసాద్‌లను డీఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు నిమిత్తం బాపట్ల ఎస్పీ కార్యాలయానికి రివార్డ్‌కు ప్రతిపాదన పంపడం జరిగిందని వివరించారు. విలేకరుల సమావేశంలో వేమూరు సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు గుంటూరు 'బార్' ఎన్నికలు

- ఉదయం 10 నుంచి ఓటింగ్..
- రాత్రికి లెక్కింపు

నగరంపాలెం: ది గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం నగరంపాలెం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సంఘ కార్యాలయంలో ఓటింగ్ ప్రక్రియ మొదలుకానుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 4.30 వరకు ముగియనుంది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత లెక్కింపు ప్రక్రియ మొదలుకానుంది. రాత్రికల్లా గెలుపు అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నారు. అయితే ఓటింగ్ కోసం మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు వచ్చే అసోసియేషన్ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బార్ అసోసియేషన్ పరిధిలో 1,942 మంది న్యాయవాదులు ఉన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు నగరంపాలెం పీఎస్ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

అభ్యర్థులు వీరే..

అధ్యక్ష పదవి (ఒక్క పోస్ట్)కి యంగలశెట్టి శివసూర్యనారాయణ (బబ్లూ), కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యక్ష పదవి (ఒక్క పోస్ట్)కి ఎం.దేవరాజు (దేవ), బీవీ.గౌరీశంకర్, ఏపీ లాలీ, చింతా రామకోటిరెడ్డి (డాక్టర్ రామకోటిరెడ్డి), ప్రధాన కార్యదర్శి పదవి (ఒక్క పోస్ట్)కి యర్రసాని అజయ్‌కుమార్, గురజాల అనురాధ, మోదుకూరి శ్రీనివాసరావు, సుబ్బయ్య లక్కీ, సంయుక్త కార్యదర్శి పదవి (ఒక్క పోస్ట్)కి కట్టా నరసింహం, విజయవర్మ, కోశాధికారి పదవి (ఒక్క పోస్ట్)కి కలే దేవదాసు, మేడికొండూ మల్లిఖార్జునరావు, లైబ్రరీ కార్యదర్శి పదవి (ఒక్క పోస్ట్)కి పల్లె నరసింహారావు (పీఎస్ఆర్), బొప్పా శ్రీనివాసరావు, క్రీడ, కల్చరల్ కార్యదర్శి పదవి (ఒక్క పోస్ట్)కి ఇస్మాయిల్ సయ్యాద్, పూదోట రాజేష్‌లింగం, గండికోట శేషగిరిరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (మూడు పోస్ట్‌లు) పదవులకు షేక్.మస్తాన్‌వలి, తోట నాగసాయిరామ్, బర్మా రాజశేఖర్, షేక్.రిహానాబేగం, రాయపూడి శ్రీనివాసరావు (గుండు శ్రీను), మోర్ల వెంకటకృష్ణ బరిలో ఉన్నారు.

'ఇంటెలిజెంట్' ఏఎస్ఐపై విచారణ

'సాక్షి' కథనంపై ఆరా తీసిన ఉన్నతాధికారులు

మంగళగిరి: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ పనితీరు వివాదాస్పదం కథనం నగరంలో సంచలనం సృష్టించగా పోలీస్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఉదయం నుంచే పోలీస్ వర్గాల్లో చర్చ సాగింది. స్థానిక పోలీస్ అధికారులు కూడా ఈ కథనంపై ఆరా తీశారు. ఏఎస్ఐ పనితీరు, గత ఎన్నికల్లో తన గురువు అయిన మాజీ రామాంజనేయులు సహకారంతో లోకేష్ గెలుపు కోసం తీవ్ర స్థాయిలో కృషి చేశారని, మళ్లీ ఈ ఎన్నికల్లోనూ లోకేష్ గెలుపుకోసం పని చేస్తున్నాడని తెలుసుకున్న అధికారులు విస్మయానికి గురయ్యారు. తొలినుంచి వివాదాస్పదుడైన సదరు ఏఎస్ఐపై వచ్చిన కథనంపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టారు. ఏఎస్ఐపై వేటు ఖాయమంటూ పలువురు అధికారులు చర్చించుకోవడం గమనార్హం.

తల్లి మృతి.. పది పరీక్షలకు హాజరైన తనయుడు

- భార్య మృతదేహం ఇంటి వద్దే ఉన్నా తనయుడిని పరీక్షకు తీసుకువెళ్లిన తండ్రి
- బలుసుపాడులో విషాద ఘటన



తండ్రితో కలసి పరీక్ష రాసేందకు వచ్చిన యోగేంద్ర



మృతి చెందిన తల్లి పావని (పాత చిత్రం)

పెదకూరపాడు: కన్నతల్లి పేగు బంధం ఒక వైపు..పది పబ్లిక్ పరీక్షలు మరో వైపు.. ఆ విద్యార్థికి అగ్ని పరీక్ష పెట్టాయి. పదహారేళ్ల పాటు కంటికి రెప్పలా కని పెంచిన తల్లి మృతి చెందినా.. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని.. అమ్మ మాటలను గుర్తు చేసుకొని తండ్రితో కలసి తల్లి కోర్కెను తీర్చేందుకు పరీక్ష రాసేందుకు వచ్చాడు ఆ విద్యార్థి. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన కడియాల ఆదినారాయణ, పావనిలకు వెంటక యోగేంద్ర, పూజిత సంతానం. ఆదినారాయణ న్యూడిల్స్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తారు. గత వారం రోజులుగా తల్లి పావని జ్వరంతో బాధ పడుతుంది. ఈ క్రమంలో ఆదివారం పావనికి జ్వరం తీవ్రం కావడంతో సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.వైద్యులు ఆమెకు డెంగ్యూ లక్షణాలతో పాటు కామెర్లు కూడా సోకినట్లు గుర్తించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. ఈ క్రమంలో కుమారుడు వెంటక యోగేంద్ర మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో జెడ్పీ పాఠశాల నందు పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. తల్లి పావని మృతివార్త తెలుసుకొని తల్లడిల్లాడు. తన తల్లి ఆశయం కోసం ఆమె మృతదేహం ఒక వైపు ఉన్నా తండ్రి ఆదినారాయణతో కలసి పరీక్ష రాసేందుకు వచ్చాడు. ఈ విషాద గాథ పలువురిని కంట తడి పెట్టించింది.

విశ్రాంత జడ్జి సాల్మన్‌రాజ్‌కు నివాళి



సాల్మన్ రాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు


సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి అనేక మంది కక్షిదారులకు సత్వరమే న్యాయం అందించేలా విశ్రాంత న్యాయమూర్తి సాల్మన్‌రాజ్ కృషి చేశారని పలువురు న్యాయవాదులు కొనియాడారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన సాల్మన్ రాజ్ మృతి చెందారు. మంగళవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఆయన మృతి న్యాయ వ్యవస్థకు, వారి కుటుంబానికి తీరని లోటన్నారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ నెల్లూరు జిల్లా జడ్జిగా ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఆయన న్యాయసహాయం చేయడంలో ఎప్పుడూ ముందు ఉండేవారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన సేవలందించినట్లు చెప్పారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజవరపు శివనాగేశ్వరరావు, బూతుకూరి రామిరెడ్డి, సయ్యద్ అబ్దుల్‌రహీమ్, దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్, చిన్నం మణి బాబు, కంబాల అనిల్ కుమార్, కన్నెధార హనుమయ్య, జొన్నలగడ్డ విజయ్ కుమార్, సూరె వీరయ్య, మూర్తి, బీఎల్ కోటేశ్వరరావు, ఆర్.నరసింహారావు, పి.రవి, వి.పాపారావు, బి.శ్రీనివాసరావు, టి. హరనాథ్ బాబు, జగన్ మోహనరావు, ఎస్.బాబూరావు పాల్గొన్నారు.

హైకోర్టులో ఏసీ ఏఎంసీ కోసం టెండర్ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: హైకోర్టులో ఏర్పాటు చేసిన డైకిన్, మిత్సుబిషి క్యాసెట్, స్ప్లిట్ ఏసీల వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ (ఏఎంసీ) విషయంలో స్థానిక డీలర్లు, ఏజెన్సీల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తూ హైకోర్టు రిజిస్ట్రీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తిగల వారు ఏప్రిల్ 4 సాయంత్రం 5 గంటలలోపు సీల్డ్ కవర్‌లో తమ కొటేషన్లను సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు హైకోర్టు వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

పోలీస్ కుటుంబాలకు రూ.10.93 లక్షల సాయం

చెక్కులు అందజేసిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు తోటిబ్యాచ్ కానిస్టేబుళ్ల ఆర్థిక సహాయం చేయటం అభినందనీయమని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన ఇరువురి కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు రూ.10.93 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. 2011 బ్యాచ్‌కు చెందిన ఎన్.అశోక్, యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, ఈ ఏడాది మార్చి 6వ తేదీన కోటప్పకొండ బందోబస్తు విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా, చిలకలూరిపేట పట్టణ శివారులో అతడి బైకును వెనుకనుంచి టిప్పర్‌లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అతడికి తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు అందరూ కలసి తమ వంతు సహాయంగా ఇచ్చిన రూ.8 లక్షలు చెక్కు, పోలీస్ అసోసియేషన్ నుంచి చేయూత పథకం కింద మంజూరైన మరో రూ.లక్ష చెక్కును కానిస్టేబుల్ భార్య సీహెచ్ లక్ష్మీదేవికి అందజేశారు. అదేవిధంగా జిల్లా ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్ పనిచేస్తున్న ఎస్.గోపిరెడ్డి, మార్చి మూడో తేదీన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీస్ అసోసియేషన్ నుంచి చేయూత పథకం కింద రూ.లక్ష చెక్కు, ఏఆర్ విభాగం అందించిన రూ.93 వేలు నగదును ఆ కానిస్టేబుల్ భార్య కె.పూర్ణిమకు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధి రెడ్డి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు, 2011 బ్యాచ్ కానిస్టేబుళ్లు సీహెచ్ అనంత్, ఎస్.శివప్రసాద్, కె.రాయపరెడ్డి, షేక్ ఎం.బాషా, కె.మధుబాబు, శివరాంప్రసాద్, రత్న కిషోర్ పాల్గొన్నారు.